క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని నేరడి కొండమీద ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం ముగింపు సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన వార్షికోత్సవాల్లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఫిజియోథెరపీ సేవలు పరిశీలిస్తున్న ఎంఈవో రాజారావు

పొందూరు రూరల్: భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలను తల్లిదండ్రులు, నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో-2 రాజారావు సూచించారు. స్థానిక భవిత కేంద్రాన్ని మంగళవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఫిజియోథెరపీ సేవలను పరిశీలించి తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ రమ్య ప్రియాంక, ఐఈఆర్పీలు కె.దినేష్, రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనకు 'నవోదయం'



బస్సులో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

పాతపట్నం: గ్రామాల్లో నాటుసారా నిర్మూలనకు ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమం చేపడుతోందని శ్రీకాకుళం ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఒడిశా-ఆంధ్ర చెక్‌పోస్టులను మంగళవారం ఆయన పరిశీలించారు. సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిశా నుంచి ఆంధ్రాకు నాటుసారా, మద్యం రవాణా చేసే రహదారుల వద్ద విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. సరిహద్దు గ్రామాలపై దృష్టి సారించాలన్నారు. ఆయనతో పాటు పాతపట్నం ఎక్సైజ్ సీఐ కె.కృష్ణారావు, ఎస్‌ఐ శ్రీనివాసరావు ఉన్నారు.

బైండోవర్ ఉల్లంఘన



పాపారావును విచారిస్తున్న అధికారులు

పాతపట్నం: మండలంలోని రొంపివలస గ్రామానికి చెందిన సాహుకారి పాపారావు బైండవర్ కేసు ఉల్లంఘించాడు. దీంతో అతడికి తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ రూ.15 వేల అపరాధ రుసుం విధించారని ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సాహుకారి పాపారావుని హాజరుపరిచారు. గతంలో మద్యం అమ్మకాలు, అక్రమ రవాణా చేయనని బైండవర్ కేసు పాపారావుపై నమోదు చేశామని, అయినప్పటికీ 18 ఒడిశా మద్యం బాటిళ్లతో పట్టుబడినట్లు తెలిపారు. దీంతో అతడికి జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

పాతపట్నం: మండలంలోని బొమ్మిక గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను మంగళవారం వేశారు. ఈ సందర్భంగా ఏడీ ఎం.కరుణాకరరావు మాట్లాడుతూ.. గాలికుంటు నివారణకు మండలంలో 13,200 పశువులకు టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలియజేశారు. టీకాలు వేయడానికి నాలుగు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఆరుమాసాలు పైబడిన పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యులు పి.అనిల్, కె.మౌనిక, నిరంజన్, మోహన్, ఉత్తమరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల తగాదా

మెళియాపుట్టి: మండల కేంద్రంలో 10వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు గొడవపడ్డారు. వివేక్ అనే విద్యార్థి దినేష్ అనే విద్యార్థిని కొట్టడంతో తలకు గాయమైంది. దీంతో మెళియాపుట్టి పీహెచ్‌సీలో చికిత్స అందించి, స్కానింగ్ కోసం టెక్కలి ఆస్పత్రికి తరలించారు.

వేతన వెతలు..!

- సకాలంలో అందని ఉపాధి వేతనాలు
- విడుదలవ్వని నిధులు
- లబ్ధిదారులకు ఆర్థిక ఇబ్బందులు



మబగాం చానల్‌లో పనిచేస్తున్న వేతనదారులు

నరసన్నపేట: గ్రామాల్లో వలసల నివారణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హమీ పథకం **కూలీలకు సకాలం**లో వేతనాలు అందడం లేదు. **రోజువారీ మస్టర్లు** వేస్తూ.. బిల్లులు జనరేట్ చేస్తున్నా **వేతనాలు** మాత్రం పడడం లేదు. దీంతో **వేతనదా**రులు ఆందోళన చెందుతున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వందలాది మంది పనులు చేస్తున్నా, వేతనాలు చెల్లించడంతో మాత్రం తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. దీంతో నెలల తరబడి వేతనాలు చెల్లించకపోతే **ఎలా** అని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

భారీగా బకాయిలు

ప్రతీ కూలీకి గరిష్ఠంగా రూ.300ల వేతనం **అందేలా** చర్యలు తీసుకోవాలని సిబ్బందికి **జిల్లా అధికా**రులు సూచనలు చేస్తున్నారు. అయితే నరసన్నపేట నియోజకవర్గంలో మాత్రం సరాసరిన రూ.150ల నుంచి రూ.240ల వరకు మాత్రమే వేతనం వస్తోంది. ఈ లెక్కన దాదాపు ఒక్కొక్కరికీ రూ.10 వేలకు పైగా బకాయిలు ఉన్నాయి. ఒక ఇంట్లో ఇద్దరేసి వ్యక్తులు పనికి వెళ్తే ఒక్కో కుటుంబానికి రూ.20 వేలకు పైబడి ఉపాధి వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకొని బకాయిలు వెంటనే ఖాతాలకు జమ చేయాలని వేతనదారులు కోరుతున్నారు.

నరసన్నపేటలో వేతనదారుల వివరాలు

మండలం	నరసన్నపేట	జలుమూరు	సారవకోట	పోలాకి
జాబ్ కార్డులు	12,266	13,868	11,341	15,909
వేతనదారులు	18,677	21,849	18,137	27,129

60 రోజులుగా వేతనాలు లేవు



రోజుల తరబడి పనికి వెళ్తున్నా, ఇంతవరకు వేతనాలు అందలేదు. 15 రోజులకు ఒకసారి ఖాతాలకు జమచేస్తామన్నారు. ఇప్పటికే 60 రోజులు అవుతున్నా జమ చేయడం లేదు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వెంటనే అధికారులు స్పందించి వేతనాలు జమ చేయాలి.

– గొద్దు సింహాచలం, వేతనదారు, తామరాపల్లి

వెంటనే చెల్లించాలి



రోజుల తరబడి ఉపాధి పనులు పనిచేస్తున్నాం. కానీ ఇప్పటివరకు వేతనాలు అందలేదు. వారం వారం పోస్టాఫీసుకు వెళ్లి చెక్ చేస్తుంటే ఇంకా డబ్బులు జమ అవ్వలేదని చెబుతున్నారు. దీంతో రోజురోజుకీ బకాయిలు పెరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు జమ చేయాలి.

– ధర్మాన సాయమ్మ, వేతనదారు, దేవాది

నిధులు రావాలి



ఉపాధి వేతనాలకు సంబంధించి నిధులు విడుదల వ్వాల్సి ఉంది. సుమారు ఆరు నుంచి ఏడు వారాలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు వచ్చిన వెంటనే జమ చేస్తాం. వారం పది రోజుల్లో నిధులు వస్తాయని భావిస్తున్నాం. వేతనదారులు ఆందోళన చెందవద్దు. పూర్తిస్థాయిలో వేతనాలు చెల్లిస్తాం.

– యుగంధర్, ఏపీవో, నరసన్నపేట

పార్టీ నాయకులతో ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ కన్నబాబు



మర్యాదపూర్వక భేటీ

ఆమదాలవలస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్‌గా ఇటీవల నియమితులైన మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతంపై చర్చించారు. ఆయనతో పాటు విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ చిన్న శ్రీను, పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేవీజీ సత్యనారాయణ, పార్టీ కాళింగ కుల విభాగ రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, పార్టీ జిల్లా కార్యదర్శి కోట గోవిందరావు, నాయకురాలు తమ్మినేని వాణీసీతారాం, పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సంబరాలు



కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

సారవకోట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులనాయుడు గెలిపొందడంపై ఉపాధ్యాయులు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని పీఆర్టీయూ, ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సారవకోట ఎమ్మార్సీ ఆవరణలో కేక్ కట్ చేశారు.

కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వాన కామేశ్వరరావు, బి.లక్ష్మీనారాయణ, రమేష్ నాయుడు, చౌదరి గిరీశ్వరరావు, యామల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగం



సారవకోట మండలంలోని మదనాపురం గ్రామంలో గతంలో నిర్మించిన పంచాయతీ భవనం నిరుపయోగంగా మారింది. అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఈ భవనాన్ని నిర్మించారు. అయితే ప్రస్తుతం ఈ భవనం చుట్టూ పశువులు కట్టుకుంటున్నారు. అలాగే స్థానికులు ఈ భవనాన్ని స్టోర్ రూమ్‌గా వినియోగించుకుంటున్నారు. – సారవకోట

ప్రమాదకరం



కొత్తూరు మండలంలోని గులుమూరు-నివగాం రోడ్డు ఆకులతంపర సమీపంలో ఒకవైపు కోతకు గురైంది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈ రోడ్డును ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేసినప్పటికీ, కోతకు గురైన ప్రాంతంలో చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. – కొత్తూరు

పరిశీలన



పొందూరు మండలంలోని పంట పొలాల్లో విడిచిపెట్టిన వరి కుప్పలు, నూర్చిన ధాన్యాన్ని డీఎస్‌వో సూర్యప్రకాష్ మంగళవారం పరిశీలించారు. కనిమెట్ట, కింతలి, తోలాపి, పెనుబర్తి, గోరింట, దళ్లవలస, కోటిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు పొలాల్లోనే బస్తాలు ఉంచారు. ఆయనతో పాటు ఏవో బెండి బాబ్జి, వ్యవసాయ సహాయకులు, రైతులు ఉన్నారు. – పొందూరు

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



ఆటో డ్రైవర్‌కు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ హైమావతి

ఎల్.ఎన్.పేట: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సరుబుజ్జిలి ఎస్‌ఐ బి.హైమావతి సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లౌడ్ స్పీకర్లు లేకుండా ఆటోలను నడపాలని స్పష్టం చేశారు. డ్రైవర్‌కు రెండు వైపులా ప్రయాణికులు ఉంటే అపరాధ రుసుము విధించడంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చర్యలు తప్పవన్నారు.

విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పీఎంశ్రీ టీమ్ సభ్యులు

సరుబుజ్జిలి: విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య సూచించారు. పీఎంశ్రీ కమ్యూనిటీ ఔట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా వెన్నెలవలస ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పరికరాల తయారీ, పని తీరు గురించి వివరించారు. విద్యార్థులు నేర్చుకున్న విజ్ఞానాంశాలు మరింతమందికి చేరువ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బేతనసామి, సీఆర్పీ బెండి చిన్నారావు, రెడ్డీస్ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ అత్తులూరి లావణ్య, అత్తులూరి గిరి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా మరుగుదొడ్ల నిర్వహణ



వెలుగు కార్యాలయంలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్డి

సరుబుజ్జిలి: గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్వహణపై అవగాహన కల్పించే అధికారులు తమ కార్యాలయాల్లో మరుగుదొడ్లపై అశ్రద్ధ వహిస్తున్నారు. మండల కేంద్రంలోని పశువైద్యశాల, వెలుగు, ఎంపీడీవో కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో మరుగుదొడ్డి ఎల్లప్పుడూ తాళాలు వేసి ఉంటుంది. ట్రాన్స్‌కో, విద్యాశాఖ, వ్యవసాయ శాఖ, హౌసింగ్ కార్యాలయాలకు పూర్తిగా మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో కార్యాలయాలకు వస్తున్న ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో నానా ఇబ్బందులు పడుతున్నారు. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగుదొడ్ల నిర్వహణపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సాగునీటికి కష్టాలు



కొత్తకోట వద్ద వంశధార పిల్ల కాలువలో పనిచేయని షట్టర్

సరుబుజ్జిలి: ఆరుగాలం కష్టపడి పంట పండించే అన్నదాత సాగునీటికి నానా అవస్థలు పడుతున్నాడు. పంట చేతికందివచ్చే దశలో సాగునీరు అందక ప్రతిఏటా తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. మండలంలోని ఏఎల్‌నగరం నుంచి పురుషోత్తపురం వరకు సుమారు 16 కిలోమీటర్లు మేర వంశధార కుడి ప్రధాన కాలువతోపాటు, 22 పిల్ల కాలువలు విస్తరించి ఉన్నాయి. వీటిద్వారా 4వేల హెక్టార్ల భూమిని సాగు చేస్తున్నారు. అదేవిధంగా 14 కిలోమీటర్లు మేర యరగాం-పురుషోత్తపురం ఓపెన్ హెడ్ ఛానల్ విస్తరించి ఉంది. ఈ కాలువ ద్వారా సుమారు 2వేల హెక్టార్ల భూమి సాగవుతోంది. అయితే వంశధార ప్రధాన కాలువతో పాటు, పిల్ల కాలువలకు ఏర్పాటు చేసిన షట్టర్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. చెక్‌డ్యామ్‌లు, షట్టర్లకు మరమ్మతులు చేయకపోవడం వలన సాగునీటిని మళ్లించడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సాగునీరు వృథాగా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షట్టర్లు సక్రమంగా లేకపోవడంతో కొన్నిచోట్ల రైతులు సొంతంగా కర్ర చెక్కలు ఏర్పాటు చేసుకొని పొలాలకు సాగునీటిని మళ్లిస్తున్నారు. మరి కొంతమంది వరిగడ్డిని సాగునీటికి అడ్డంగా పెట్టి, వాటిపై మట్టివేసి నీటికి అడ్డుకట్ట వేస్తున్నారు. నీటి ఉధృతి పెరిగినపుడు ఇవికూడా ప్రవాహంలో కొట్టుకుపోతున్నాయని వాపోతున్నారు.

ఆలయ వార్షికోత్సవం రేపు

సరుబుజ్జిలి: మండలంలో చిన్నపాలెం గ్రామ సమీపంలోని అభయాంజనేయ స్వామివారి ఆలయ వార్షికోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మెండ సూర్యారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారికి తమలదళార్చన, సహస్రనామార్చన, పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈనెల 10వ తేదీన పురుషోత్తపురం గ్రామంలోని ఉమాకామేశ్వర ఆలయంలో స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గంగవరపు వాసుదేవశర్మ తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం



తాగునీటి సమస్యపై సమీక్షిస్తున్న సర్పంచ్ శంకర్

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ బూరల్లి శంకర్, ఈవో ద్రాక్షాయిణిలు తెలిపారు. ఈ మేరకు నీటి సరఫరాపై పంచాయతీ సిబ్బందితో మంగళవారం సమీక్ష నిర్వహించారు.

నరసన్నపేట ప్రజలకు దేవాది వద్దనున్న పంపుల నుంచి తాగునీరు వస్తుందని, అయితే ఈ బోర్లలో నీటి సామర్థ్యం పడిపోవడంతో పూర్తిస్థాయిలో తాగునీటిని సరఫరా చేయలేకపోతున్నామని తెలిపారు. నిపుణులైన లేబర్ అందుబాటులో లేకపోవడం వలన కొంత ఆలస్యం అవుతోందన్నారు. పూర్తిస్థాయిలో నీటి సరఫరాకు మరో పది రోజుల సమయం పడుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

సీనియార్టీ లిస్టులో తప్పులను సవరించాలి

పొందూరు: జిల్లా విద్యాశాఖ కార్యాలయం విడుదల చేసిన ఉపాధ్యాయుల సీనియార్టీ లిస్టులోని తప్పులను సవరించాలని, 610 జీవో ద్వారా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయుల పేర్లు సీనియార్టీ ప్రకారం లేవని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా 2000 డీఎస్సీలో ఎంపికై వివిధ జిల్లాల్లో పనిచేసిన ఉపాధ్యాయులు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు 610 జీవో ద్వారా బదిలీ అయినప్పుడు, మొదటి నియామకం పొందిన తేదీ కాకుండా పలువురు ఉపాధ్యాయులకు 2007లో చేరినట్లు లిస్టులో ఉందని చెప్పారు. దీంతో ముందుకు రావాల్సిన పేర్లు వెనుకకు వెళ్లిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి తప్పులను సవరించాలని కోరారు.

యోగాసనాలపై అవగాహన



విద్యార్థినులతో యోగాసనాలు వేయిస్తున్న సీడీపీవో విమలారాణి

పాతపట్నం: స్థానిక బ్రాహ్మణవీధిలో ఉన్న విజ్ఞాన్ పాఠశాలలో విద్యార్థినులకు యోగాసనాలపై సీడీపీవో టి.విమలారాణి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యోగాతో మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందన్నారు. బాలికలు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డి.గంగధర్, సూపర్‌వైజర్లు జి.అనూరాధ, డి.అమరావతి, శాంతామణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

45 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు

నరసన్నపేట: స్థానిక ఎల్‌వీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన 45 మంది విద్యార్థులు సంతూర్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసన్న తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు మంజూరైన స్కాలర్‌షిప్ ధ్రువీకరణ పత్రాలు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులకు సంతూర్ స్కాలర్‌షిప్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.24 వేలు అందజేస్తారని తెలిపారు. ఇంటర్ వరకు ప్రభుత్వ కళాశాలల్లో చదువుకొని, డిగ్రీ విద్యనభ్యసిస్తున్నవారు అర్హులని పేర్కొన్నారు.